క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నాదెండ్ల: సాతులూరు సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా సోమవారం ఉదయం 7 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. ఈ మేరకు డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. సాతులూరు, బీసీ కాలనీ, ఎస్సీ కాలనీ, శావల్లపాడు రోడ్డు, చందవరం రోడ్డు, చందవరం, చందవరం ఇండస్ట్రీస్‌కు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని చెప్పారు. చిలకలూరిపేట పసుమర్రు సబ్‌స్టేషన్ మరమ్మతులు, కొత్త లైన్ల ఏర్పాటు దృష్ట్యా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రూరల్ ప్రాంతాలైన పసుమర్రు, గొట్టిపాడు, మానుకొండవారిపాలెం, కుక్కపల్లివారిపాలెం, నాగభైరువారిపాలెం, ఈవూరివారిపాలెం గ్రామాలకు సరఫరా ఉండన్నారు.

21న బంద్‌ను విజయవంతం చేయండి



వినుకొండ(నూజెండ్ల): ఈ నెల 21న దేశవ్యాప్త బంద్‌ను అందరూ విజయవంతం చేయాలని మాల మహానాడు కోరింది. పట్టణంలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో మాల మహానాడు ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోదా జాన్‌పాల్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును దేశవ్యాప్తంగా వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ఈ నెల 21న భారత్ బంద్‌ను మాల మహానాడు రాష్ట్ర కమిటీ స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కీర్తిపాటి వెంకటేశ్వర్లు, కోండ్రు విజయ్, రాయన చిన్న, కొట్టె వెంకట్రావు, కొమ్మతోటి కృపయ్య, కనమాల అంకారావు, బేతం దేవానంద్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత స్థానం



నాదెండ్ల: చక్కటి విద్యాభ్యాసంతో జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగొచ్చని హెచ్ఎం కృష్ణానాయక్ చెప్పారు. గణపవరం శ్రీ కెల్లం పల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గతేడాది పదో తరగతి టాపర్లు, ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు, మెమొంటోలు అందించారు. చిలకలూరిపేట పురుషోత్తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ.. ఫౌండేషన్ సేవలను అభినందించారు. ఫౌండేషన్ నిర్వాహకులు కళ్లెం రత్నరాజు, సుశీల, ప్రవీణ్, మౌనిక, న్యాయవాది ఆనందరావు, పెద్ది రమేష్, ఇన్‌చార్జి హెచ్ఎం ఉషారాణి, ఉపాధ్యాయులు పద్మావతి, దినకర్ పాల్గొన్నారు.

సకాలంలో విత్తనాల పంపిణీకి కృషి

ఈపూరు: రైతులు జేజీఎల్ రకానికి ప్రత్యామ్నాయంగా కేఎస్ఎం 1638 వరి రకం విత్తనాలు సాగు చేసుకోవచ్చని ఏవో రామారావు తెలిపారు. కావాల్సిన వారు ఒక రోజు ముందుగా వ్యవసాయ అధికారులకు, సిబ్బందికి చెప్పాలన్నారు. తద్వారా సకాలంలో తాము అందించే అవకాశం ఉంటుందని వివరించారు. ఈ విత్తనాల సాగు పంట కాలం 130 నుంచి 135 రోజులు ఉంటుందని చెప్పారు. ఉల్లికోడును తట్టుకుంటుందని వెల్లడించారు. హెక్టారుకు 6 నుంచి 7 టన్నులు దిగుబడి వస్తుందని తెలిపారు. బీపీటీ 5204, ఎంటీయూ 1224, ఎన్ఎల్ఆర్ 34449 రకాలను కూడా సాగు చేసుకోవచ్చని సూచించారు. ఈ విత్తనాలు దోమపోటు, అగ్గి తెగులను తట్టుకుంటాయని తెలిపారు. విత్తనాలను ఏపీ సీడ్స్, ఆధీకృత డీలర్ల నుంచిగానీ తీసుకోవాలని కోరారు. వ్యవసాయ సిబ్బంది సూచనలతో పంటసాగు చేయాలని తెలిపారు.

పోట్లూరు వాసికి గౌరవ డాక్టరేట్ ప్రదానం



శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామానికి చెందిన అబ్బూరి రామారావుకు కృష్ణా విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగంలో పరిశోధన అంశం సమర్పించినందుకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. అబ్బూరి చినకోటయ్య, రుక్మిణమ్మ దంపతుల కుమారుడైన రామారావు ప్రఖ్యాతి చెందిన ఎరాస్మస్ ఉపకారవేతనంతో జర్మనీ, నార్వే దేశాలలో రసాయన శాస్త్రంలో స్పెక్ట్రోస్కోపీ విభాగంలో ఉన్నతవిద్య అభ్యసించారు. పరిశోధనకు సంబంధించిన పత్రాలు పలు జాతీయ,అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. ఈ సందర్భంగా మలినేని ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు గోనుగుంట్ల రామస్వామి, గ్రామ పెద్దలు ఆయనకు అభినందనలు తెలిపారు.

భూమికి బలం.. రైతుకు ఫలం!

- పచ్చిరొట్ట ఎరువుతో ఎన్నో ప్రయోజనాలు
- సమృద్ధిగా పోషకాలు అందే అవకాశం
- రైతులకు తగ్గనున్న పెట్టుబడి ఖర్చులు
- దిగుబడుల పెంపునకూ ఎంతో దోహదం

రైతన్నలకు నేడు సాగు అంటేనే ఖర్చుల భారం అన్నట్లు పరిస్థితి తయారైంది. 'వ్యయ'సాయంగా మారిన నేటి పరిస్థితుల్లో పెట్టుబడుల తగ్గింపుతోపాటు దిగుబడుల పెంపుపైనా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. దీనికి సేంద్రియ ఎరువులను వినియోగించాలి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అందిస్తున్న రాయితీ విత్తనాలతో పచ్చిరొట్ట సాగు చేయడం ద్వారా ఎక్కువ లబ్ధి పొందవచ్చు.

శావల్యాపురం: రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని పెంచడంతో భూమిలో సారం పూర్తిగా తగ్గిపోతోంది. దీంతో పెట్టుబడులు కూడా విపరీతంగా పెరిగిపోతున్నాయి. దిగుబడులు కూడా తగ్గాయి. దీంతో పలువురు పచ్చిరొట్ట ఎరువు సాగు వైపు ఆసక్తి చూపుతున్నారు. ఖరీఫ్ సీజను ప్రారంభానికి ముందు ఇలా సాగు చేయటానికి ప్రభుత్వం రాయితీపై మంజూరు చేసిన విత్తనాలతో జీలుగులు, పిల్లిపెసర, జనుము సాగుకు సమాయాత్తం అవుతున్నారు. ఎకరానికి 10 కేజీల చొప్పున చల్లాలి. నెల రోజుల తర్వాత ఏపుగా పెరిగిన పచ్చిరొట్టను ట్రాక్టరుతో తొక్కించి భూమిలో కలిసేలా దుక్కి దున్నాలి. దీంతో మొత్తం కుళ్లి భూమిలోకి ఇంకిపోతుంది. వారం రోజులకు గొర్రు, గుంటుక, రోటావేటరుతో భూమిని శుభ్రపరిచి పంట సాగు చేసుకోవాలి. పచ్చిరొట్ట సాగు చేసిన భూమిల్లో పోషకాల శాతం పెరుగుతుంది. రసాయనిక ఎరువుల వినియోగం తగ్గుతుంది. దీంతో రైతులకు పెట్టుబడులు భారం నుంచి ఉపశమనం కలుగుతుంది. నత్రజని, భాస్వరం, పొటాష్‌లు సేంద్రియ రూపంలో భూమిలో కలిసిపోతాయి. రైతుల్లో చైతన్యం పెరిగి అధికంగా సేంద్రియ ఎరువులను వినియోగిస్తే మేలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.



పొలంలో సాగు చేసిన పచ్చిరొట్ట

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

రైతులకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలను 50 శాతం రాయితీపై అందిస్తున్నాం. దీన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. జీలుగులు, జనుము, పిల్లిపెసర తదితర విత్తనాలను అర్హత కలిగిన రైతులకు మంజూరు చేశాం. వాటిని సద్వినియోగం చేసుకొని పచ్చిరొట్ట ఎరువు సాగుకు ఆసక్తి చూపాలి. ఇలా సాగు చేయటం ద్వారా భూమిలో అన్ని రకాల పోషకాలు సమృద్ధిగా లభ్యం అవుతాయి. తద్వారా రసాయనిక ఎరువుల వినియోగం తగ్గుతుంది.

– రామినేని రామారావు, మండల వ్యవసాయ అధికారి, శావల్యాపురం

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం


నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలో వేంచేసి యున్న శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి నరసరావుపేటకు చెందిన సంకా సూర్యప్రకాశరావు, భానుమతి దంపతులు రూ.1,01,116 విరాళం అందజేశారు. ఆలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఈవో టి.సుధాకరరెడ్డికి ఈ మొత్తాన్ని చెక్ రూపంలో ఇచ్చారు. తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం విరాళం అందించినట్లు సూర్యప్రకాశరావు తెలిపారు. మరింత మంది ముందుకొచ్చి విరాళాలు ఇవ్వాలని ఈవో కోరారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఈవో సుధాకరరెడ్డికి చెక్కు అందిస్తున్న దాతలు

వైభవంగా శ్రావణ మాస బోనాలు

బెల్లంకొండ: శ్రావణ మాసం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం దేవతామూర్తులకు వైభవంగా శ్రావణ మాస బోనాలను భక్తులు సమర్పించారు. మండల కేంద్రమైన బెల్లంకొండలో గ్రామ దేవత ముత్యాలమ్మకు భక్తులు పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని బుడగజంగాలు అమ్మవారికి బోనాలను సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. మండలంలోని చంద్రాజుపాలెం గ్రామంలో పోలేరమ్మ తల్లి జాతరను భక్తులు నిర్వహించారు. భక్తులు జలబిందెలతో ఊరేగింపుగా వెళ్లి దేవతామూర్తులకు జలాభిషేకాలను నిర్వహించారు. పొంగళ్లు చేసి నైవేద్యాలను సమర్పించారు.



ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ తల్లి



చంద్రాజుపాలెంలో బోనాలను సమర్పిస్తున్న భక్తులు

సకాలంలో వర్షాలు.. కళకళలాడుతున్న చేలు

అమరావతి : ఈ ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటివరకు సకాలంలో కురిసిన వర్షాలకు మండలంలోని గ్రామాలలో అన్ని పంటల సాగుకు అనుకూలంగా ఉండటంతో ప్రధానంగా పత్తి పంట ఏపుగా పెరుగుతుండటంతో రైతులలో సంతృప్తి వ్యక్తం అవుతుంది. ఇటీవల కురిసిన వర్షాల వల్ల వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. కొన్ని గ్రామాల్లో ఇప్పటికే ఎరువులు వేసి పత్తి పంటలో అంతరకృషి చేస్తుండటంతో పత్తి మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. అదనుకు వర్షాలు పడుతుండటంతో పత్తి చేలు నవనవలాడుతున్నాయి. అలాగే మిరప నారు కూడా పెరుగుతుండటంతో నాటు వేయటం కోసం రైతులు పొలాలను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. మండలంలో అత్యధికంగా వర్షాభావ పంటలు పండిస్తుండటంతో ఇప్పటివరకు అదనుకు వర్షం పడుతుండటంతో రైతులలో హర్షం వ్యక్తమవుతుంది. మండలంలో పత్తి సుమారు 22 వేల ఎకరాలలో సాగు చేయగా, మిర్చి 3000 ఎకరాలలో సాగు చేసే అవకాశం ఉందని, వరి 200 ఎకరాలు, కూరగాయలు, ఇతరాలు 300 ఎకరాలలో సాగు అవుతుందని వ్యవసాయాధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. గత సంవత్సరం తెగుళ్ల వల్ల నష్టపోయిన రైతులు ఈ ఏడాది దిగుబడులు పెరుగుతాయన్న ఆశతో సాగు చేస్తున్నారు.



ముత్తాయపాలెం వద్ద ఏపుగా పెరుగుతున్న పత్తి పైరు

వజ్రోత్సవాలను విజయవంతం చేయండి

అచ్చంపేట: స్థానిక తుమ్మేపల్లి శ్రీరాములు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను స్థాపించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 2025 జూన్‌లో జరిగే వజ్రోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని పాఠశాల పూర్వవిద్యార్థుల సంఘ అధ్యక్షులు ఉప్పల శ్రీనివాసమూర్తి పిలుపునిచ్చారు. పాఠశాల ఆవరణలో ఆదివారం పూర్వవిద్యార్థుల సంఘ సభ్యులు సమావేశమయ్యారు. ఈ పాఠశాలలో చదివిన ఎందరో విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉన్నారని చెప్పారు. మహానుభావుడు తుమ్మేపల్లి శ్రీరాములు 5 ఎకరాల విస్తీర్ణంలో 12 సువిశాల గదులు నిర్మించి జిల్లా పరిషత్‌కు అప్పగించారన్నారు. పాఠశాలలో చదివిన విద్యార్థులంతా తప్పనిసరిగా వచ్చే జూన్ నెలలో జరిగే వజ్రోత్సవ వేడుకలలో పాల్గొని విజయమంతం చేయాలన్నారు. దీనిపై సెప్టెంబర్ 21వ తేదీన పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థులతో సమావేశం జరుగుతుందని, సాధ్యమైనంత మంది పాల్గొని వేడుకల నిర్వహణకు సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి పసుపులేటి పాపిరెడ్డి, కోశాధికారి సూరే సంపత్, కొప్పురావూరి కోటేశ్వరరావు, సూరే కోటిలింగం, గుండా వాసుదేవరావు పాల్గొన్నారు.



సమావేశంలో పూర్వ విద్యార్థుల సంఘ ప్రతినిధులు

గొర్రెలలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

అమరావతి: వర్షాకాలం సీజన్‌లో గొర్రెలు, మేకలలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల పెంపకం దారులు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండటం అవసరమని మండల పశు వైద్యాధికారి వెంకట్రామయ్య అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గొర్రెలు, మేకల పెంపకం దారులలో వ్యాధుల పట్ల అవగాహన కొరవడటంతో వారు నష్టపోతున్నారన్నారు. గొర్రెలు, మేకల పెంపకం దారులు నిరంతరం అప్రమత్తంగా ఉండి వాటికి వచ్చే కాలిపుండ్లు, నీలినాలుక, పచ్చిక దొమ్మ వంటి వ్యాధులను గమనించాలన్నారు. వీటిలో కాలిపుండ్ల వ్యాధికి టీకాలు ఉన్నాయన్నారు. నీలినాలుక వ్యాధి వైరస్ ద్వారా వ్యాపించటంతో దీనికి టీకాలు లేవని దీని నివారణకు రాత్రిళ్లు వేపాకు పొగ వేయాలని, బ్యుటాక్స్, డెల్టామిత్రిన్ వంటి మందులను గొర్రెలు, మేకలపై స్ప్రే చేయాలన్నారు. పచ్చిక దొమ్మ వ్యాధి తడిసిన మేతను తినటం వల్ల వస్తుందని, దీని నివారణకు మేత ఆరిన తర్వాత మాత్రమే మేపాలన్నారు. మండల పరిసర ప్రాంతాలలో సున్నం, బ్లీచింగ్ చల్లాలని సూచించారు. బురదగా ఉంటే గొర్రెలను మెరక ప్రాంతాలలో కట్టి వేయాలన్నారు. ప్రస్తుత సీజన్‌లో ఈ మూడు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

వైభవంగా ఆలయ కొలుపులు



నాదెండ్ల: సాతులూరు గ్రామంలో కొలువుదీరిన శ్రీ తేనె అంకమ్మ, కాటి అంకమ్మ దేవాలయాల్లో కొలుపులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ముందుగా అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. మూడేళ్లకోసారి కొలుపులు నిర్వహించటం ఆనవాయితీ. వడియరాజుల ఇలవేల్పుగా అమ్మవార్లను కొలుస్తారు. కొలుపుల సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. ఆయన వెంట టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ, నాయకులు ఉన్నారు.

ఘనంగా శాంతి హోమాలు



నాదెండ్ల: సాతులూరు గ్రామంలో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మాణంలో ఉన్న రెడ్డిపేరంటాలమ్మ తల్లి ఆలయం పైకప్పు పనులు ఆదివారంతో ముగిశాయి. ముందుగా ఆలయం వద్ద శాంతి హోమాలు నిర్వహించారు. ఒంగోలుకు చెందిన సనాతన శంకర పీఠాధిపతి నెమ్మికటి నరసయ్యచార్య స్వామి, వేదపండితుల ఆధ్వర్యంలో ఈ హోమాలు జరిగాయి. కమిటీ సభ్యులు హోమాల్లో పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి పూజలు నిర్వహించారు. నిర్వాహకులు అన్నదానం చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

కౌలు రైతులందరికీ పంట రుణాలకు కృషి



ఎస్.శ్రీధర్‌రెడ్డి

సత్తెనపల్లి: కౌలు రైతులందరికీ సీసీఆర్సీ కార్డులు, పంట రుణాలు అందించేందుకు కృషి చేస్తున్నామని మండల వ్యవసాయ అధికారి ఎస్.శ్రీధర్‌రెడ్డి చెప్పారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సత్తెనపల్లి మండలంలో 2024-25 సంవత్సరానికి మొత్తం 3,080 సీసీఆర్సీ కార్డులు పంపిణీ చేయాలనేది లక్ష్యం కాగా ఇప్పటి వరకు 3,089 సీసీఆర్సీ కార్డులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. 2024-25 సంవత్సరానికి గాను కౌలు రైతులకు రుణాలు రూ.9.9 కోట్లు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 145 మందికి రూ.0.9 కోట్లు రుణాలు ఇప్పించడం జరిగిందన్నారు. కౌలు రైతుల జాబితాను ఇప్పటికే బ్యాంకులకు పంపామని, ప్రతి కౌలు రైతును గుర్తించి వ్యక్తిగతంగా, జేఎల్‌జీ గ్రూపుల ద్వారా రుణాలు అందించే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. త్వరలో మండలంలోని కౌలు రైతులందరికీ ఈ ఖరీఫ్ సీజన్‌లో పంట రుణాల ప్రక్రియ వేగవంతం చేసి లబ్ధి చేకూరుస్తామన్నారు. ప్రభుత్వం ఇప్పటికే బ్యాంకులకు కౌలు రైతుల పంట రుణాల ప్రక్రియకు సంబంధించిన మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు.

పునఃప్రారంభానికి సిద్ధమైన సీతారామాలయం



అచ్చంపేట: మండలంలోని చింతపల్లిలో పవిత్ర కృష్ణానదీ తీరంలో పునర్నిర్మించబడిన సీతారాముల దేవాలయ ప్రారంభోత్సవం సోమవారం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య జరుగనుంది. ఈ సందర్భంగా గత రెండు రోజులుగా స్వామి వారి విగ్రహాల సంప్రోక్షణ, రామ నామ ఏక వర్ణము వంటి కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా స్వామి వారి దేవాలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రారంభోత్సవం అనంతరం అన్నదాన కార్యక్రమం జరుగుతుందని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు వచ్చేసి తీర్థప్రసాదాలు స్వీకరించవలసిందిగా కోరారు.

ఇద్దరు పిల్లలు సహా తల్లి అదృశ్యం

నరసరావుపేట టౌన్: ఇద్దరు పిల్లలను తీసుకొని పుట్టింటికి బయలుదేరిన భార్య అదృశ్యమైందంటూ భర్త ఫిర్యాదు చేశారు. చిలకలూరిపేట మండలం మురికిపూడి గ్రామానికి చెందిన ఎస్.నాగరాజు చేసిన ఫిర్యాదు మేరకు... తన భార్య సుధారాణి స్వగ్రామమైన అచ్చంపేటకు వెళ్తానంటే మురికిపూడి నుంచి నరసరావుపేటకు వచ్చి ఆర్టీసీ బస్టాండ్‌లో ఇద్దరు కుమార్తెలతోపాటు బస్ ఎక్కించాడు. వారు పుట్టింటికి చేరలేదు. ఫోన్ చేసినా స్పందన లేదు. గాలించినా ఆచూకీ లభించలేదు. భర్త ఫిర్యాదుతో అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ విజయ్‌చరణ్ ఆదివారం రాత్రి తెలిపారు.

మిత్రులకు సాయం.. బడి ప్రగతి ధ్యేయం



నాదెండ్ల జెడ్పీ హైస్కూలులో కలిసిన పూర్వ విద్యార్థులు

ఆదర్శంగా నిలిచిన పూర్వ విద్యార్థులు

నాదెండ్ల: వారంతా నాలుగు దశాబ్దాల క్రితం కలిసి చదువుకున్నారు. తర్వాత పెళ్లిళ్లు, ఉద్యోగాల రీత్యా వేర్వేరు ప్రాంతాలలో స్థిరపడ్డారు. ఇన్నాళ్లకు మళ్లీ కలుసుకుని అప్పటి మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి చేయూతనిచ్చారు. నాదెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1984-85 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఉత్సాహంగా జరిగింది. వివిధ రంగాలు, ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడిన 40 మంది తమ కుటుంబాలతో హాజరయ్యారు. ఆనాటి చిలిపి అల్లర్లు, మధుర స్మృతులను నెమరు వేసుకుంటూ సాయంత్రం వరకు సరదాగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను స్మరించుకున్నారు. గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థిని నల్లమోతు లక్ష్మి రూ.2 లక్షలు, మిగిలిన వారు రూ.లక్ష నిధులను సమకూర్చారు. తమతో చదువుకుని ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన విప్పర్ల సంగీతరావుకు రూ.లక్ష, పిట్టల లక్ష్మయ్యకు రూ.50 వేలు ఆర్థిక సాయం అందించారు. మిగిలిన మొత్తాన్ని పాఠశాల అభివృద్ధికి అందించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు వీఆర్వో జంపాల మధుసూదనరావు, పాదిలి సీఐ బి.మల్లికార్జునరావు, అక్కయ్య చౌదరి, లోకేశ్వరరావు, ఇందు, శ్రీదేవి, ధనలక్ష్మి, పద్మ పాల్గొన్నారు.

వడియరాజుల సేవా సంఘం పట్టణ కార్యవర్గం ఎన్నిక

నరసరావుపేట: వడియరాజుల సేవా సంఘం పట్టణ అధ్యక్షుడిగా వేముల పాండురంగారావు ఎన్నికయ్యారు. స్థానిక వడియరాజుల కార్యాలయంలో ఆదివారం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్యఅతిథులుగా టీడీపీ రాష్ట్ర హెచ్ఆర్‌డీ డైరెక్టర్ వల్లెపు నాగేశ్వరరావు, వేముల శంకర్‌నారాయణ, ఓర్సు గోవిందరావు మంచాల వెంకట్రావు, వేముల శివ హాజరయ్యారు. వీరి సమక్షంలో గౌరవ అధ్యక్షులుగా వల్లెపు కృపారావు, ప్రధాన కార్యదర్శిగా వల్లెపు లక్ష్మయ్య, ఉపాధ్యక్షులుగా బత్తుల సెల్వరాజు, వేముల శ్రీనివాసరావు, గుంజి ఆంజనేయులు, సహాయ కార్యదర్శులుగా కుంచాల శ్రీను, బండారు శివనాగేశ్వరరావు, కుంచాల వెంకటేశ్వర్లు, కోశాధికారిగా కుంచాల రవికుమార్, కార్యవర్గ సభ్యులుగా గుంజి రవికుమార్, మహిళా అధ్యక్షురాలిగా అచ్చి వీరమ్మ ఎన్నికయ్యారు. ప్రెసిడెంట్ వేముల పాండురంగారావు మాట్లాడుతూ.. పదిహేను రోజుల్లో వడ్డెర సంఘం ప్రమాణ స్వీకారం జరుగుతుందని అన్నారు.



నూతన కార్యవర్గ ప్రతినిధులు

వైద్యుల నిరసన ప్రదర్శన



నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీ ఉద్యోగుల సంఘం నాయకులు, వైద్య సిబ్బంది

నరసరావుపేట ఈస్ట్: కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ ఆదివారం ఏపీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది ప్రదర్శన నిర్వహించారు. ఘటనకు బాధ్యులైన వారిపై కఠినచర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు స్వర్ణ చినరామిరెడ్డి, ఎం.ఫ్లారెన్స్, చుక్కా వెంకటేశ్వర్లు, ఏఎన్ఎంలు లింగమ్మ, సంపూర్ణ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు

రాజుపాలెం: మండల కేంద్రంలోని రాజుపాలెంలో వేంచేసి ఉన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో నాల్గవ రోజు ప్రథమ పుష్కర ద్వాదశ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ పూజా కార్యక్రమంలో దేవస్థానం నిర్వాహకులు, బాలాజీ టెంపుల్ ట్రస్ట్ చైర్మన్ పాత్తూరి వెంకట రమసుబ్బారావులు స్వామి వారి నిత్యారాధన, మంగళాశాసనం, వసంతోత్సవం, యాగశాలలో పూర్ణాహుతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం మొక్కపాడు బ్రహ్మం మాస్టారు ఆధ్వర్యంలో శ్రీసత్యసాయి కోలాట భజన మండలి బృందంచే మహిళా కోలాటం నిర్వహించారు. శనివారం రాత్రి నిర్వహించిన బాలనాగమ్మ జానపద నాటకం చూపరులను ఆకట్టుకుంది. మాయల ఫకీరు జెట్టి సాంబశివరావు చేసిన నటనకు ప్రేక్షక కళా పోషకులు ముగ్దులయ్యారు. సోమవారం వేంకటేశ్వర తత్వవైభవంపై ప్రవచనం ఉంటుంది.



మాయల ఫకీరు నాటకంలోని సన్నివేశం